ప్రజాశక్తి

బుధవారం 7 డిసెంబర్ 2022

5

పార్వతీపురం మన్యం

పతాక నిధికి కలెక్టర్ విరాళం

ప్రజాశక్తి-కలెక్టరేట్

విరాళం అందిస్తున్న కలెక్టర్

సాయుధ దళాల పతాకనిధికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ విరాళం అందించారు. పతాక నిధికి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో మంగళ వారం కలెక్టర్ ప్రారంభించారు. పతాక నిధి ఫ్లాగ్‌ను జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు కలెక్టర్‌కు అందించారు. పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని జిల్లాలోని పౌరులను, వ్యాపార వేత్తలను, పారిశ్రామికవేత్తలను కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, మాజీ సైనికుల సంక్షేమ ప్రతినిధి కోరాడ నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

గుమడాంలో.. గూడు కట్టేదెవరు?

మున్సిపాలిటీలో గుమడాం జగనన్న లేఅవుట్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. లేఅవుట్ ప్రారంభించి ఏడాదిన్నర దాటినా ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఈ లేఅవుట్‌లో 1337 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీరిలో కనీసం పది శాతం మంది కూడా ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదు. మిగిలిన చోట్ల ఏర్పాటు చేసిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన సాగుతోంది. ఇక్కడ మాత్రం మూడడుగుల ముందుకు ఆరడుగుల వెనక్కి అన్న చందంగా మారింది. హౌసింగ్, మున్సిపల్ అధికారులు, వార్డు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఏడాది కాలంగా లబ్దిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు జరగడం లేదు. దీంతో అధికారులపై తీవ్ర ఒత్తిడి వస్తోంది.

గుమడాం లేఅవుట్‌లో అరకొరగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు

- వెలవెలబోతున్న గుమడాం జగనన్న లేఅవుట్
- అవగాహన కల్పించినా ముందుకు రాని లబ్ధిదారులు

ప్రజాశక్తి-సాలూరు

మొదటి విడత గృహనిర్మాణ శాఖ మంత్రిగా చేసిన శ్రీరంగనాథరాజు ఏడాది క్రితం గుమడాం లేఅవుట్‌ని పరిశీలించారు. అప్పుడు లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. లేఅవుట్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయినా లబ్ధిదారుల్లో చలనం లేదు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బెదిరించారు. కొంతమంది కట్టలేమని చెప్పి పట్టాలను అధికారులకు అప్పగించారు. ఇంతవరకు లేఅవుట్‌లో సుమారు 40 మంది పునాదులు నిర్మించి వదిలేశారు. ఇంత పెద్ద లేఅవుట్‌లో ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు. జిల్లాలో కొన్ని చోట్ల లేఅవుట్లలో గృహ ప్రవేశాలు కూడా జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా లేఅవుట్‌ని సందర్శించారు. ఇంటర్నల్ రోడ్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యాలు వున్నాయని, ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ఆయన కోరారు.

మట్టిపై అపనమ్మకంతోనే!

పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమడాం లేఅవుట్‌లో పెద్ద టౌన్‌షిప్ అభివృద్ధి చేయాలని కలలు కన్న అధికారుల ఆశలు నీరుగారిపోతున్నాయి. సౌకర్యాలన్నీ కల్పిస్తున్నా నిరుపేద లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అయోమయ పరిస్థితి కనిపిస్తోంది. కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసిన లేఅవుట్ భూమి ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం కాదనే అభిప్రాయం లబ్ధిదారుల మెదళ్లలో నాటుకుపోయింది. పునాది నిర్మాణానికే లక్ష రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. పునాది కింద నుంచి ఇనుముతో ప్లింథ్ భీమ్ నిర్మించుకుని రావాల్సి వుంటుందని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి ఇంటి నిర్మాణానికి లక్షా 80వేల రూపాయలు మంజూరు చేస్తోంది. పునాది నిర్మాణానికే లక్ష రూపాయలు ఖర్చు చేస్తే మిగిలిన డబ్బుతో ఇల్లు ఎలా కడతామని ఆందోళన చెందుతున్నారు.

థర్డ్ ఆప్షన్‌పై ఆశలు

జగనన్న లేఅవుట్‌లో మూడో ఆప్షన్ కింద ఇల్లు నిర్మించుకోలేని పేదలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించాలని తొలుత నిర్ణయించింది. ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో భాగంగా వాలంటీర్ల ద్వారా ప్రభుత్వం సర్వే చేసింది. ఇళ్లు సొంతంగా నిర్మించుకుంటారా, సొంత స్థలంలో నిర్మించుకుంటారా, ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలా? అనే ఆప్షన్లు ఇచ్చింది. వీటిలో చాలామంది ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలనే ఆప్షన్ ఎంచుకున్నారు. అయితే గుమడాం లేఅవుట్‌లో థర్డ్ ఆప్షన్‌ని లబ్ధిదారులు ఎంపిక చేసుకోకపోయినా ప్రభుత్వం నిర్మించి ఇవ్వాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దీనిపైనే లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రత్యేక శ్రద్ధ వహించి థర్డ్ ఆప్షన్ కింద ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టరుతో చేయిస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఓటర్ల నమోదులో బిఎల్ఒలే కీలకం

ఓటర్ల జాబితా పరిశీలకులు అహ్మద్‌బాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఓటర్ల నమోదులో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమని ఓటర్ల జాబితా పరిశీలకులు ఎ.అహ్మద్ బాబు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు నమోదు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఓటరు నమోదు కోసం నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు చాలా కీలకమన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయవలసిన బాధ్యత బిఎల్ఒలపై ఉందన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటరు నమోదులో ఎవరికైనా సమస్యలుంటే నేరుగా ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఫోను నంబరు 9441412121 లేదా ababu@ias.nic.in మెయిల్‌కు తెలియజేయాలని కోరారు.



జిల్లా ఉన్నతాధికారులతో ఓటర్ల జాబితా పరిశీలకులు అహ్మద్‌బాబు

అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో ఓటర్లను పక్క పంచాయతీలో నమోదు చేశారని, దీనివల్ల ఎన్నికల్లో ఓటు వేయడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీటిని సవరించాలని కోరారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒలు బి.నవ్య, సి.విష్ణు చరణ్, సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ

సీతంపేట : ఆంధ్రప్రదేశ్ నైపుణ్య శిక్షణ అభివృద్ధి సంస్థ బిఎస్‌సి కెమిస్ట్రీ విద్యార్థులకు విజయనగరం టిటిడిసిలో నాలుగు నెలలపాటు శిక్షణ ఇస్తున్నట్లు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శిక్షణలో భోజన, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9000308185 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

జియ్యమ్మవలస : మండలంలోని టి.కె.జమ్ము గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను డిడి బి.సూర్యనారాయణ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మేటివ్ పరీక్షల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన తీరుపై ఆయన ఉపాధ్యాయులతో సమీక్షించారు. ప్రధానోపాధ్యాయులు గౌరి, ఎటిడబ్ల్యుఒ చంద్రబాబు, సురేష్ పాల్గొన్నారు.

భామిని.. అరటిపంట నష్టాన్ని పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

గజరాజుల హల్ చల్

ప్రజాశక్తి -భామిని

మండలంలో బిల్లుమడా పంచాయతీ పరిధిలోని పంట పొలాల్లో సోమవారం రాత్రి ఒడిశా నుంచి వచ్చిన రెండు ఏనుగులు హల్‌చల్ చేశాయి. మొక్కజొన్న, అరటి, కూరగాయల పంటలతోపాటు నీటి పంపులను ధ్వంసం చేశాయి. మంగళవారం బిల్లుమడా సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి లోవ అనసూయ, సచివాలయ సిబ్బంది పంట నష్టాన్ని పరిశీలించారు.

చిన్నబగ్గ టేకు ప్లాంట్‌లో..

సీతంపేట : మండలంలో చిన్నబగ్గ రిజర్వు ఫారెస్టు టేకు ప్లాంట్‌లో రెండు ఏనుగులు సంచరించాయి. హిరమండలం, సారవకోట ప్రాంతం నుండి వచ్చాయి. దీంతో చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు భయాందోళన చెందుతున్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

ప్రజాశక్తి-కలెక్టరేట్

బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పార్వతీపురంలో కోర్టు జంక్షన్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో రెడ్డి వేణు మాట్లాడుతూ రాజ్యాంగానికి, మతసామరస్యానికి బిజెపి తూట్లు పొడిచిందన్నారు. లౌకికతత్వాన్ని మంటగలిపిందని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.అశోక్ మాట్లాడుతూ అంబేద్కర్ కోరుకున్న సమానత్వం నేటికీ కలగానే మిగిలిపోయిందని, రోజురోజుకి ఆర్థిక, సామాజిక అసమానతలు, మత ఘర్షణలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం శ్రామిక మహిళా నాయకులు వి.ఇందిర, గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పండు, రాజశేఖర్, రాజు, భాస్కర్, ముఖేష్, సంతు పాల్గొన్నారు.

విద్యారంగ నిర్వీర్యానికి కుట్ర

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ విమర్శించారు. మంగళవారం పార్వతీపురంలోని ఎన్‌జిఒ హోంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను నిర్బంధిస్తూ, అరెస్టులు చేయడం చాలా దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల హక్కులను కాలరాసే పనిలో నిమగ్నమై

అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉన్నాయి తప్ప విద్యార్థులకు సమస్యలను పరిష్కరించే ఆలోచన చేయకపోవడం విచారకరమన్నారు. పార్వతీపురంలో చేపట్టిన ఎయిడెడ్ పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ విద్యార్థులలో ఉత్తేజాన్ని నింపిందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితమే ప్రభుత్వపరమని, పాలకుల భిక్ష కాదని స్పష్టంచేశారు.

జిల్లా కమిటీ ఎన్నిక

డి.పండు

పి.రాజశేఖర్

ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా నూతన కమిటీని 19 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి.పండు, కార్యదర్శిగా పి.రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా కె.రాజు, వరుణ్, సహాయ కార్యదర్శులుగా కె.భాస్కర్, బి.గంగారావు, చిన్నారి, జగదీష్ ఎన్నికయ్యారు.

పలు తీర్మానాలు ఆమోదం

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. అందులో కొన్ని..

- పార్వతీపురం, పాలకొండ కేంద్రాల్లో పీజీ సెంటర్, సాలూరులో ఇంజినీరింగ్ కళాశాల, సీతంపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలి.
- గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి.
- పార్వతీపురంలో గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు అదనపు భవనాలను నిర్మించాలి.
- ఎస్‌సి, బిసి సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలలి.
- గరుగుబిల్లి మండలంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి.
- గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పాలకొండ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో సరిపడా అధ్యాపకులను నియమించాలి.
- ప్రతి గ్రామాలకు స్టూడెంట్స్ బస్సులు నడపాలి.
- మూసివేసిన పాఠశాలలు, వసతిగృహాలు వెంటనే పునప్రారంభించాలి.
- ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో, కళాశాలల్లో ఫీజులకు అనుగుణంగా ప్రమాణాలు పాటించాలి.
- జిఒ 77ను రద్దు చేయాలి. బకాయి డైట్ బిల్లులు వెంటనే మొత్తం విడుదల చేయాలి.

కొటియాపై ప్రభుత్వ వైఖరి అనుమానాస్పదం

లోక్‌సత్తా కార్యనిర్వాహక అధ్యక్షులు బాబ్జీ

ప్రజాశక్తి-సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల విషయంలో ఎపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అనుమానాస్పదంగా ఉందని లోక్‌సత్తా కార్యనిర్వాహక అధ్యక్షులు బీసెట్టి బాబ్జీ ఆరోపించారు. మంగళవారం పట్టణంలో జాహ్నవి మెడికల్ షాపులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొటియా గ్రామాల ప్రజలు ఆంధ్రాలో ఉంటామని చెపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వారికి భరోసా ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. గత కొంతకాలంగా కొరాపుట్ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు దూకుడుగా వ్యవహరించడం, ఎపి అధికారుల ఉదాసీనత చూస్తుంటే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్‌తో సిఎం జగన్ మోహన్ రెడ్డి జరిపిన చర్చలు ఏయే అంశాలపై జరిగాయో స్పష్టత లేదని చెప్పారు. ఒడిశాకు చెందిన కేంద్ర మంత్రి ఒకరు ఎపి రాజకీయాలను ప్రభావితం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కొటియా గ్రామాలపై పట్టు బిగించడానికి ఆయన ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా పావులు కదుపుతున్నారని ఆరోపించారు. కొటియా గ్రామాల ప్రజలు ఆంధ్రాలో ఉంటామని చెపుతున్నా వారికి భరోసా ఇవ్వలేని పరిస్థితి ఎందుకొచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

రుణాల మంజూరు వేగవంతం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్

రుణాల మంజూరు వేగవంతం చేసి, ఔత్సాహికులను ప్రోత్సహించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్థిక ప్రగతి రావాలని, ఇందుకు బ్యాంకులు సానుకూల దృక్పథంతో ఉండాలని పేర్కొన్నారు. బ్యాంకు శాఖలను ఏర్పాటు చేసి ప్రజలకు బ్యాంకుల సేవలు దగ్గర చేయాలని సూచించారు. సంబంధిత శాఖలు సైతం యూనిట్ల ఏర్పాటులో జాప్యం చేయరాదని ఆదేశించారు. లబ్ధిదారులను సకాలంలో గుర్తించి బ్యాంకుల నుండి రుణాలు మంజూరుకు సమన్వయం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో పాడి యూనిట్లు, చేపల యూనిట్లను ఏర్పాటు చేయడంలో సంబంధిత శాఖలు వేగంగా స్పందించాలన్నారు. రైతుల ఆదాయం పెరగాలని, కుటుంబాలు ఆర్థిక

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

స్వావలంబన దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. స్టాండ్ అప్ ఇండియా, స్వనిధి, పిఎంఇజిపి తదితర కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్. మూర్తి మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలకు సెప్టెంబరు నెలాఖరుకు రూ.186.43 కోట్లు లక్ష్యం కాగా రూ.113 కోట్లను అందించినట్లు తెలిపారు. ప్రాధాన్యత లేని రంగాలకు రూ.39 కోట్లకు గాను రూ.41 కోట్లను మంజూరు చేసినట్లు వివరించారు. ఇందులో వ్యవసాయానికి రూ.106 కోట్లకు గాను రూ.63 కోట్లను అందించామన్నారు.

ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ నాగ ప్రవీణ్, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి నాగార్జున, ఎస్‌బిఐ, యుబిఐ, ఎపిజివిబి కంట్రోలర్లు వరుసగా వెంకటేష్ దేశాయ్, సభ్యసాచి దాస్, బి.రాఘవేంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలు

ప్రమాదకరంగా కరెంటు తీగలు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని డంగభద్ర గ్రామంలో ప్రాథమిక పాఠశాలతోపాటు పలువురి ఇళ్ల మీదుగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ విద్యుత్తు తీగల వల్ల గ్రామానికి చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి మరణించారని సిపిఎం మండల కార్యదర్శి కె.సీతారాం ఆవేదన వ్యక్తంచేవారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, విద్యుత్తు తీగలను మార్చాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ఈ నెల 12, 13,14 తేదీల్లో విజయనగరంలో జరిగే ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దావాల రమణ కోరారు. పాలకొండలో మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు కె.గౌరీశ్వరి, టి.శారద, పి.శ్రీదేవి, సూర్యకళ, గౌతమి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

సీతానగరం : ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ కోరారు. స్థానిక పిహెచ్‌సి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

సీతానగరం.. మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

కార్యక్రమంలో నాయకులు బి.పద్మ, ఆర్.లక్ష్మి, బి.రవణమ్మ పాల్గొన్నారు.

పాచిపెంట : ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నాగవేణి, జి.నిర్మల, బి.భవాని ఆధ్వర్యంలో పాచిపెంట, గురువునాయుడుపేట పిహెచ్‌సిల వైద్యాధికారులకు ఈ నెల 12న సెలవు కావాలని వినతులు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ప్రభావతి, కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ విజయనగరంలో జరిగే ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

కొమరాడ: ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. కొమరాడ, కూనేరు, మాదలింగి పిహెచ్‌సిల వద్ద మహాసభ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, పార్వతి, గంగమ్మ, హేమలత, ఎల్లమ్మ పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు నాయకులు వి.ఇందిర డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను డోకిశిల పిహెచ్‌సి వద్ద విడుదల చేశారు. అనంతరం వైద్యాధికారి నవీన్ కుమార్‌కు 12న సెలవు మంజూరు నిమిత్తం వినతి సమర్పించారు. కార్యక్రమంలో విజయ, రమణమ్మ, లీలారాణి, పుష్ప, రజిని తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట.. సెలవు కోసం వినతి అందిస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

పాలకొండరూరల్.. మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

జెపిఎల్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎంపి విజయసాయిరెడ్డి, జెడ్పి చైర్మన్, తదితరులు

జెపిఎల్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా డిసిఎంఎస్ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన సారధ్యం లో నిర్వహించే జగనన్న ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) క్రికెట్ టోర్నీ పోస్టర్లను విజయవాడలో పార్టీ చేతులమీదుగా విడుదల చేశారు. వైసిపి రాష్ట్ర కో- ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి రెడ్డి, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి (శ్రీ బొత్స) సత్యనారాయణ, జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పోస్టర్లను ఆవిష్కరించారు. విజయనగరంలో 50టీములతో జెపిఎల్ పేరిట నిర్వహిస్తున్న ఈ టోర్నీలో విన్నర్లకు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25వేల నగదు బహుమతి అందిస్తున్నట్లు అవనాపు విక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని పార్టీ నాయకులు అభినందించారు.

ఎపిసిపై ఆర్‌జెడి విచారణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడుపై ఇటీవల వచ్చిన పలు ఫిర్యాదులు, ఆరోపణలపై మంగళవారం విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ ఎం. జ్యోతికుమారి విచారణ చేపట్టారు. సర్వశిక్షలో పనిచేస్తున్నపలువురు ఉద్యోగులను ఆకారణంగా తొలగించారని బాధితులు ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈనేపధ్యంలో విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలు ప్రకారం విచారణ చేపట్టినట్లు ఆర్‌జెడి తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని తెలిపారు.

కిశోర్‌కు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మిస్టర్ ఆంధ్రా పోటీల్లో విజేతగా నిలిచిన సూరాబత్తుల కిశోర్‌ను ఎమ్మెల్యే జోగారావు అభినందించారు. పట్టణానికి చెందిన కిశోర్ ఇటీవల శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన శరీర సౌష్టవ పోటీల్లో మిస్టర్ ఆంధ్రా టైటిల్‌ను అందుకున్నాడు. ఈ నేపధ్యంలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగారావును కిశోర్ కలిశాడు. ముందుముందు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరెన్నో విజయాలు సాధించాలని ఎమ్మెల్యే అభిలషించారు. ఈ కార్యక్రమంలో బాలు, న్యూ ఆంధ్రా బాడీబిల్డర్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరమణ నాయుడు

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-వీరఘట్టం

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు సర్పంచులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎక్కడ, ఏ పనులు చేయాలో వాటిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేకూరే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.ప్రభాకర్‌రావు, సర్పంచులు పి.గౌరమ్మ, ఉదయాన సూర్యనారాయణ, మాచర్ల ఉమామహేశ్వరరావు, ఎంపిటిసిలు ఎన్.కన్నామణి, మంతిని హేమలత పాల్గొన్నారు.

ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కృష్ణరాయపురం, బూర్జ గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మంగళవారం ఎఒ అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, కావలసిన గోనె సంచులు అందిస్తామని తెలిపారు. ఆయనతోపాటు వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న డిఎస్‌పి సుభాష్

వృద్ధులే వారసత్వ సంపద

డిఎస్‌పి సుభాష్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

వృద్ధులే వారసత్వ సంపదని డిఎస్‌పి సుభాష్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్లో వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి సమకూర్చిన దుప్పట్లు, రగ్గులను 11, 17వ వార్డుల్లోని వృద్ధులకు, వితంతువులకు డిఎస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ కృష్ణారావు, ఎస్ఐ ఫకృద్దీన్, అమ్మన్నారావు, తాడ్డ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చామంతికి ఘన సన్మానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా వైద్యవృత్తి ద్వారా సేవలు అందించిన మండంగి చామంతిని మంగళవారం మండ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గిరిజన మహిళ చామంతి డాక్టర్ చదివి ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మండ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విశిష్ట సేవలు అందిస్తున్న పాలక దేవనంద్‌ను సర్పంచ్ హైమావతి, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మెస్మా పీడీ మండంగి కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి

డిప్యూటీ సిఎం రాజన్నదొర

సాలూరు.. అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం పట్టణంలోని పెదదళితవాడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, దళిత, గిరిజనుల సంక్షేమానికి ముందుచూపుతో రాజ్యాంగ రచన చేసిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగంలో దళిత, గిరిజనుల కోసం కల్పించిన హక్కులు కారణంగానే తన లాంటి సామాన్య గిరిజనుడు డిప్యూటీ సిఎం స్థాయిలో ఉన్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంప ప్రకాశరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, గొల్లపల్లి వరప్రసాద్, మాజీ కౌన్సిలర్ మజ్జి అప్పారావు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.భరత్ భూషణ్, సర్పంచ్ టి.ఉపేంద్ర, కెవిపిఎస్ కన్వీనర్ ఎన్.గురుమూర్తి, కౌన్సిలర్ కిల్లారి మోహన్, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు,

పార్వతీపురం..అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి చైర్‌పర్సన్ వై.రాధాకుమారి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు బివి రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు దూసి తిరుపతిరావు, కుప్పిలి శ్రీనివాసరావు, పుచ్చల గోపాల్, యాకబ్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : బడుగు, బలహీన వర్గాల జీవితాలను ప్రభావితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఇందిరా కాలనీ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కె.రుక్మిణి, ఐ.గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మండల అధ్యక్షులు బి.రమేష్ పాల్గొన్నారు..

పార్వతీపురంరూరల్ : మండలంలోని కృష్ణపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వీరఘట్టం : తలవరంలో ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు, నడుకూరు, బొడ్లపాడు గ్రామాల్లో జనసేన నాయకులు జానీ, ఎం. పుండరికం అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలెక్టరేట్ : పేదలంతా అభివృద్ధి కావాలని కోరుకున్న మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని జన విజ్ఞాన వేదిక నాయకులు, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సాయిరాం డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎం.రత్న కుమార్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రాజ్యాంగం అమలు కోసం ప్రభుత్వంపై నేటితరం యువత వత్తిడి తేవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రచయిత గంటేడ గౌరినాయుడు, జెవివి కార్యనిర్వాహక కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, మాట్లాడారు. ఈకార్యక్రమంలో జెవివి నాయకులు వి.వి గంగాధరరావు, డి.చంద్రమౌళి, షరీఫ్, ఎ.ఫరూక్, జి.చంద్రమౌళీ, కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీధర్ పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక యాలం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వి.కళావతి, సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్ పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కృష్ణారావు, సీనియర్ దళిత నాయకులు పుష్పనాథం, నూతలపాటి భరత భూషణ్ రాజ్, బత్తిన మోహన్ రావు, గురుబిల్లి రవికుమార్, రాయి రామకృష్ణ,

పాలకొండ.. అంబేద్కర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ఉద్యోగ సంఘ నాయకులు యమ్మల సతీష్ బాబు, బబురు గణేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక గురుకుల పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పాఠశాల కమిటీ చైర్మన్ కిమిడి భూషణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బలిజిపేట : పెదపెంకి గ్రామంలో అరుణోదయ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. సర్పంచ్ నగిరి పాపారావు, నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవ్‌నాయుడు, టిడిపి నాయకులు వాడాడ రాము, సిపిఎం నాయకులు వై.మన్మథరావు, నల్ల ఈశ్వరరావు, బత్తుల శ్రీను.. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. వేయించారు.

భామిని : అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భామిని ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంపిపి తోట సింహాచలం, సర్పంచ్ లోపింటి రాజేష్, ఎంపిడిఒ జి.కృష్ణారావు, టింగ అన్నాజిరావు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిడ్డికి ప్రసాద్, సవలపురపు రాజు, జిల్లెడి రవి పాల్గొన్నారు.

సీతంపేట : ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి అంబేద్కర్ విగ్రహానికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎఒ విజయరాణి, గురుకులం సెల్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, ఎపిజిఇఎ గౌరవ అధ్యక్షులు వై.సతీష్‌కుమార్, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ సాగర్ పాల్గొన్నారు.

పార్వతీపురం.. అంబేద్కర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎంవిఆర్ కృష్ణాజీ

రోజు కూలి రూ.600 చెల్లించాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బాగువలసలో మంగళవారం వ్యకాస మండల మహాసభను చింత లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలన్న నిబంధన తొలగించాలని, లేకుంటే దీనివల్ల కూలీలు ఉపాధికి దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేశారు. పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జన్ని ఈశ్వరరావు, తాడంగి గాసి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సిద్ధా సాయిబాబు, పొట్టంగి రాము, బోనెల అప్పలస్వామి, చందాపురం అప్పన్న, చింత లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా

మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శి కె.గంగునాయుడు

సహాయకార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గెమ్మెల జానకిరావు, వంతల సుందరరావు, డివైఎఫ్ఐ నాయకులు పి.సురేష్, డప్పు కళాకారుల సంఘం నాయకులు అబలసింగి భాస్కరరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిపై సమూల పరిశోధన

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ నవ్య

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ ప్రాంతాలలో ఉన్న సవర గిరిజన జాతి సంస్కృతిపై సమూలంగా పరిశోధన చేపట్టాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు సవర గిరిజన సంస్కృతిపై పరిశోధన చేయడానికి ప్రత్యేక బృందం పర్యటించనుంది. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సీతంపేటలో గిరిజన సంస్కృతి అందరికీ తెలిసేలా గిరిజన మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని, దానిలో సవర జాతికి ప్రత్యేక స్థానం కల్పిస్తున్నామని అన్నారు. సవర జాతిపై చేసే పరిశోధన సీతంపేట ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిసిఆర్, టిఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు, ప్రొఫెసర్ బి.శంకరరావు, అసిస్టెంట్ క్యూరేటర్ భూషణ్, అసోసియేట్ ప్రొఫెసర్ నాగరాజు, ఎపిఒ రోసిరెడ్డి, ఒఎస్‌డి ఎడ్యుకేషన్ యుగంధర్, జిసిసి డిఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

పాలకొండరూరల్ : ఈ నెల 13, 14 తేదీల్లో పార్వతీపురంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దావాల రమణారావు కోరారు. మహాసభ విజయవంతం చేయాలని మంగళవారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు.

సాలూరు రూరల్ : బాగువలస, తోణాం, మామిడిపల్లి పిహెచ్‌సిల వద్ద సిఐటియు జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, నాయకులు గేదెల సునీత, అన్నపూర్ణ, లక్ష్మి, ఈశ్వరమ్మ, డివైఎఫ్ఐ నాయకులు పి.సురేష్ , కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-బలిజిపేట

బలిజిపేట పిహెచ్‌సిని మంగళవారం ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ దుర్గా కళ్యాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎల్‌సిడిసి సర్వే వివరాలను వైద్యాధికారులు మహిపాల్, కిరణ్మయిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పెదపెంకి గ్రామాన్ని సందర్శించి, లెప్రసీని సర్వేను ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి రమణ, పిహెచ్ఎన్ చంద్రావతి, హెచ్‌వి సూర్యకుమారి పాల్గొన్నారు.

లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ కళ్యాణి

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-సాలూరు

రక్తదానం ప్రాణదానంతో సమానమని టౌన్ ఎస్ఐ వి.పాపారావు చెప్పారు. మంగళవారం పట్టణంలోని సంగీత పాఠశాల జంక్షన్ వద్ద జాహ్నవి మెడికల్ షాపులో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఎస్ఐ పాపారావు ప్రారంభించారు. మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై యువత అపోహలు తొలగించుకోవాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు బీసెట్టి బాబ్జీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆసుపత్రుల్లో రక్తనిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాతృభూమి సేవా సంఘం జిల్లా కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, ఐఆర్ డిఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చిక్కాల చిన్నమ్ములు, ప్రతినిధులు నరేష్ కుమార్, శ్రీరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చలికాలం దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని తాడికొండ పిహెచ్‌సి వైద్యులు సూచించారు. మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాలక దేవానంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు

రాజుల పాలనలో గిరిజనులకు అన్యాయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాజుల పాలనలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు, బిడ్డిక పద్మావతి తెలిపారు. మండలంలోని మండ సమీపాన తోటలో టిడిపి ఆశావహుల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛమైన గిరిజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆశావహుల్లో ఏ ఒక్కరికి టిక్కెట్ వచ్చినా కలిసికట్టుగా పని చేసేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, బిడ్డిక తమ్మయ్య, పువ్వుల లావణ్య, ఆర్ఎస్ఎస్ విజయకుమార్, భూపతి దొర, మీసాల శశిభూషణరావు, వెంకటరమణ, బిడ్డిక కొండలరావు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

మండలో 'ఇదేం కర్మ'

మండలంలోని మండ గ్రామంలో మంగళవారం ఇదేం కర్మ కార్యక్రమాన్ని టిడిపి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు, ద్వారపురెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలో గిరిశిఖర గ్రామాల గిరిజనులకు మంగళవారం టికె జమ్ము కేంద్రంగా గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ ఆధ్వర్యాన దుప్పట్లు పంపిణీ చేశారు. వీటిని ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ బి.సూర్యనారాయణ, ఎటిడబ్ల్యుఒలు చంద్రబాబు, సురేష్ గిరిజనులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభ్యుదయ సంఘం సభ్యులు కోలక గౌరమ్మ, ఆరిక చలపతిరావు, అడ్డాకుల సుందర్రావు, వాటక సింహాచలం, ఎ.జి.రావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలని వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఒ.శాంతి కుమారి, ఆదిలక్ష్మి, నవోనమ్మ పాల్గొన్నారు.

బాలికల సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-పాచిపెంట

మాట్లాడుతున్న సిడిపిఒ అనంతలక్ష్మి

ప్రస్తుతం సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలన్న దానిపై ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంత లక్ష్మి. మంగళవారం ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైంగిక వేధింపులకు గురైతే భయపడకుండా మహిళా పోలీసులకు, విఆర్‌ఒలకు, ఆశా, అంగన్వాడి కార్యకర్తలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల వీణ, ఆశ్రమ పాఠశాల హెచ్‌డబ్ల్యుఒ స్వర్ణలత పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లను నిషేధించాలని నిరసన

ప్రజాశక్తి - కురుపాం

రిలయన్స్ సంస్థ సెలూన్ వృత్తిలోకి రాకుండా ప్రభుత్వమే నిషేధించాలని కోరుతూ మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నాయీబ్రాహ్మణులు నిరసన చేపట్టారు. నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి.దుర్గారావు మాట్లాడుతూ తమ చేతివృత్తిలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించి, అనైతిక కార్యక్రమాలు చేస్తూ వృత్తిని అగౌరపరుస్తున్నారని చెప్పారు. అనంతరం తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి తిరుపతి, ఎ.చిన్నారావు, ఎ.లక్ష్మణరావు, ఎం.రవి, ఎం.రమేష్, టి.వెంకటేష్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిల సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని సీతానగరం, పెదంకలాం పిహెచ్‌సిలను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. అనంతరం బూర్జ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాధాకాంత్, శిరీష, ఉషారాణి, సిబ్బంది దుర్గాప్రసాద్ , ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జగన్మోహనరావు